సాక్షి
ఏలూరు
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన
ద్వారకాతిరుమల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సోమవారం ప్రారంభించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రాజెక్టులు ఆకట్టుకుంటున్నాయి. 10లో



ఇంటినుంచి వృద్ధురాలి గెంటివేత
ఓ వృద్ధురాలిని కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటకు నెట్టేసిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. 10లో



నాణ్యమైన మేతతో అధిక దిగుబడి
పాడి పశువులకు నాణ్యమైన మేతతో పశువుల్లో పాల దిగుబడి పెరగడంతో పాటు పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. 10లో

అపార్‌కు ఆధార్ గ్రహణం

- 50 శాతం విద్యార్థుల వివరాల్లో తేడాలు
- స్కూల్ రికార్డుల్లో ఒకలా.. ఆధార్‌లో మరోలా
- ఏలూరులో 14 శాతం, పశ్చిమలో 15 శాతం పూర్తి



నిడమర్రు ఎంఈవో కార్యాలయంలో విద్యార్థుల వివరాలు సరి చేస్తున్న కంప్యూటర్ సిబ్బంది

నిడమర్రు: విద్యార్థుల విద్యా ప్రగతి గుర్తించేలా ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)కి ఆధార్ గ్రహణం పట్టింది. స్కూల్ రికార్డ్ (యూడైస్ ప్లస్)లోని వివరాలతో ఆధార్ కార్డులో నమోదైన వివరాలు పోలి ఉంటేనే ఈ కార్డుకు సంబంధించిన 12 అంకెల అపార్ సంఖ్య సంబంధిత వెబ్‌సైట్‌లో జనరేట్ అవుతుంది. ఒక్క చిన్న అక్షరం మార్పు ఉన్నా అపార్ సంఖ్య ఇవ్వలేని పరిస్థితి.. దీంతో ఆధార్‌లోనూ, స్కూల్ రికార్డులో ఉన్న వివరాల్లో ఎక్కడ తేడా ఉందే తెలుసుకునేందుకు ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో తల్లిదండ్రులకు అవగాహన లేకపోడంతో కార్డుల్లో చిన్న తప్పులతో ఆధార్ కార్డులు జారీ అయ్యాయి. స్కూల్ రికార్డు నమోదులో ఆధార్ కార్డు కంటే జనన ధ్రువీకరణ పత్రంలోని పేర్లు, పుట్టిన తేదీల్ని మాత్రమే పరిగణలోకి తీసుకుని ఉపాధ్యాయులు తల్లిదండ్రుల అంగీకారంతో ఆన్‌లైన్ చేసేవారు. దీంతో ఆధార్‌లో, యూడైస్ ప్లస్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ విద్యార్థికి కేంద్రం జారీ చేసే అపార్ కార్డును అందించాలంటే వివరాల్లో తేడాతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. 6 నుంచి 13 ఏళ్ల కిందట తీసుకున్న ఆధార్ వివరాల్లో పెద్ద ఎత్తున తప్పులు ఉన్నాయి. ఇంతవరకూ అపార్ ప్రక్రియ ఏలూరు జిల్లాలో 14 శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 16 శాతం పూర్తయ్యింది.

జిల్లా	ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలు	విద్యార్థుల నమోదు	అపార్ ఐడీ కేటాయించిన విద్యార్థులు
ఏలూరు	2,364	3,19,997	60,143
పశ్చిమగోదావరి	2,049	2,84,277	37,505



చిన్న తేడా ఉన్నా సరే..
ఆధార్ కార్డు, స్కూల్ రికార్డులోనూ చిన్న తేడా ఉన్నా అపార్ నెంబరు రావడం లేదు. పేరులో స్పేస్, డాట్, ఆంగ్ల అక్షరాలు, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటివి ఆధార్‌లో ఉన్నట్లే స్కూల్ రికార్డులో ఉండాలి. ప్రస్తుతానికి స్కూల్ రికార్డుల్లో తప్పులుంటే (యూడైస్ ప్లస్) ఆ వివరాలకు ఒక ఫారంలో నమోదు చేసి సంబంధిత ఎంఈవో కార్యాలయం సిబ్బందితో సరిచేయించుకునే అవకాశం కల్పించారు. ఆధార్‌లో తప్పులుంటే మాత్రం ఏమి చేయాలో తెలియని పరిస్థితి. పేరులో తప్పులుంటే మాత్రమే ఆధార్ సెంటర్‌లో మార్చుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నా.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పేరు మినహా పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటివి మార్పునకు ఆధార్ కేంద్రం వద్ద కూడా అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

పట్టించుకోని ప్రైవేట్ విద్యా సంస్థలు
అన్ని సక్రమంగా ఉంటే 2 నిమిషాల్లో ఆన్‌లైన్‌లో అపార్ సంఖ్య జనరేట్ అవుతుంది. చిన్న తేడా ఉన్నా తిప్పలు తప్పడం లేదు. ఈ అపార్ కార్డుల జనరేట్ విషయంలో ప్రభుత్వ స్కూళ్లతో పోల్చితే, ప్రైవేటు విద్యాసంస్థలు అసలు పట్టించుకోవడం లేదని అపార్ గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ విషయంలో ప్రైవేటు యాజమాన్యాలు అంత శ్రద్ధ పెట్టడం లేదు. ఇప్పటికే మండలానికి ప్రతి రోజు 500 అపార్ కార్డులు జనరేట్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నా.. ప్రైవేటు విద్యాసంస్థలు పట్టించకోవడం లేదు.

27 శాతంతో ఉండి ప్రథమం
ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులకు ఈ సంఖ్యలు కేటాయించనున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రారంభించారు. ఈ నెల 18 నుంచి ప్రీ ప్రైమరీ నుంచి మిగిలిన తరగతులకు సంఖ్యను కేటాయించేలా వెబ్‌సైట్‌లో మార్పులు చేశారు. సోమవారం గణాంకాల ప్రకారం అపార్ సంఖ్యలు కేటాయింపులో పశ్చిమగోదావరి జిల్లాలో 27 శాతంతో ఉండి ప్రథమ స్థానంలో, 11 శాతంతో యలమంచిలి చివర ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

సవరణలకు అవకాశం



స్కూల్ రికార్డులో, యూడైస్‌లో, ఆధార్‌లో వివరాలు తప్పనిసరిగా ఒకేలా ఉంటేనే అపార్ జనరేట్ అవుతోంది. స్కూళ్ల వారీగా ఎంఈవో కార్యాలయం సిబ్బందిని సంప్రదించి యూడైస్ ప్లస్‌లో మార్పులు చేసుకోవచ్చు. ఆధార్‌లో తప్పుల్లో ఒక్క పేరు మాత్రమే మార్పునకు అవకాశం ఉంది.
– ఎస్. అబ్రహం, డీఈవో, ఏలూరు

238 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 238 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డీఆర్‌ఓ డి.పుష్పమణి, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అర్జీల స్వీకరణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను సకాలంలో పరిష్కరించి వాటికి సంబంధించిన పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని అన్నారు. ఫిర్యాదుదారులు విజ్ఞప్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి రీఓపెనింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఈ సందర్భంగా సూచించారు.

న్యూస్‌రీల్

మద్ది హుండీ ఆదాయం రూ.26.83 లక్షలు



మద్ది క్షేత్రంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 54 రోజులకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ: 26,83,741 వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. జంగారెడ్డిగూడెం శ్రీగోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరరావు స్వామి వారి దేవస్థానం ఆలయ ఈవో ఆలయ మానికల రాంబాబు పర్యవేక్షణలో సిబ్బంది, అర్చకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావులు పాల్గొన్నారు.

డీఆర్వోగా విశ్వేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ కె. వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసిన డీఆర్వో విశ్వేశ్వరరావు

ఏలూరు(మెట్రో) : ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులైన వి.విశ్వేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి పూలమొక్కను అందజేశారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన విశ్వేశ్వరరావు ఏలూరు డీఆర్వోగా నియమితులయ్యారు.

రక్తదానంతో ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న సీఐ రవికుమార్, పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ శివకిషోర్ స్వయంగా రక్తదానం చేశారు. కై కలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ ఇప్పటికే 18 సార్లు రక్తదానం చేయటం విశేషం. డీఎస్పీ డీ.శ్రావణ్ కుమార్, ఇతర పోలీసు అధికారులు రక్తదానం చేసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రక్తదానం చేయటం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లేనని చెప్పారు. పోలీస్ అధికారులు 42 మంది, 70 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు.

పెన్షన్ల పంపిణీకి సిద్ధం కండి

ఏలూరు(మెట్రో): నవంబరు పెన్షన్ల పంపిణీకి సంబంధించి ఈ నెల 30నే సంబంధిత సిబ్బంది బ్యాంకు నుంచి సొమ్ము డ్రాచేసి పంపిణీకి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో పెన్షన్ల పంపిణీ, స్కిల్ సెన్సెస్, పీఎం విశ్వకర్మ యోజన, సచివాలయ సర్వీసులు తదితర అంశాలపై సమీక్షించారు. అక్టోబరు 31న సెలవు కావడంతో 30నే సొమ్ము సంబంధిత సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

30న జాబ్ మేళాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ఈ నెల 30న జిల్లాలోని ఏలూరు, బుట్టాయగూడెంలో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి ఇన్‌చార్జి అధికారి వాడపల్లి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల (స్కిల్ హబ్) సత్రంపాడులో నిర్వహిస్తారని వివరాలకు 8978524022, 9493482414 నెంబర్లలో లేదా టోల్ ఫ్రీ నెంబరు 9988853335లో సంప్రదించవచ్చన్నారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో నిర్వహించే జాబ్‌మేళా సమాచారం కోసం 9182342688, 9666322032 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

దేదీప్యమానం



దీపావళి అంటేనే దీపాల పండుగ. ఇళ్లంతా ప్రమిదల్లో నూనె పోసి దీపాలతో అలంకరించడం అనాదిగా వస్తున్న ఆచారం. పూర్వం మట్టి ప్రమిదలను వినియోగించేవారు. రానురానూ ప్రమిదలు సరికొత్త హంగులను అద్దుకుంటున్నాయి. ఈ ఏడాది రాష్ట్రంలోని పలుచోట్ల నుంచే కాకుండా రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి మార్కెట్‌లో దీపాలు అమ్ముతున్నారు. లక్ష్మీ గణపతి ఆకృతి, లక్ష్మీదేవి, కలశం, శంఖు చక్రం, గజ వాహనం, కొబ్బరికాయ, పాతకాలం నాటి కిరోసిన్‌బుడ్డి దీపం, తులసికోట తదితర విభిన్న ఆకృతుల్లో ఈ ప్రమిదలు కనువిందు చేస్తున్నాయి. ప్రమిదల డిజైన్‌ను బట్టి రూ.50ల నుంచి రూ.450లు వరకు ధరల్లో ఆకట్టుకుంటున్నాయి. వీటి కొనుగోలుకు వినియోగదారులు ప్రాధాన్యమిస్తున్నారు. మరోపక్క విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు













ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ



జంగారెడ్డిగూడెం ప్రతిభ పాఠశాలలో సాక్షి స్పెల్‌బీ కేటగిరీ–4 పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్–బీ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెల్–బీ పరీక్ష మొదటి రౌండ్‌ను ప్రతిభా పాఠశాలలో సోమవారం నిర్వహించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి పర్యవేక్షణలో నాలుగు కేటగిరీలలో స్పెల్–బీ పరీక్ష జరిగింది. 1, 2 తరగతులు కేటగిరీ–1గా, 3, 4 తరగతులు కేటగిరీ–2గా, 5, 6, 7 తరగతులు కేటగిరీ–3గా, 8, 9, 10 తరగతులు కేటగిరీ–4గా విభజించి పరీక్ష నిర్వహించారు. కేటగిరీ –1 లో 25 మంది, కేటగిరీ –2 లో 49 మంది, కేటగిరీ –3 లో 77 మంది, కేటగిరీ –4లో 88 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సుభాష్ రెడ్డి తెలిపారు. తొలి రౌండ్‌లో గెలుపొందిన విద్యార్థులు తదుపరి రౌండు కు అర్హత సాధిస్తారని ప్రిన్సిపాల్ సరోజా రెడ్డి తెలియజేశారు. డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సింధూషా రెడ్డి పాల్గొన్నారు.

అన్ని అంశాలపై పట్టు సాధించాలి



నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఫ్యాకల్టీ జితేంద్ర తివారీ తదితరులు

నూజివీడు: పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని అంశాలపైనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ జరిగే విషయాల గురించి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్‌కు చెందిన మేడ్ ఈజీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్ జితేంద్ర తివారీ పేర్కొన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థులకు సంస్థ మేడీ ఈజీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో సోమవారం గేట్, ఐఈఎస్ పరీక్షల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టు పరిజ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ ఉండాలన్నారు. కార్యక్రమంలో హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఇన్‌చార్జి ఎం.రామకృష్ణ, ఫ్యాకల్టీ, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులకు షోకాజ్ నోటీసులు

సాక్షి స్పందన

లింగపాలెం: లింగపాలెం మండలంలో మీ కోసం కార్యక్రమానికి 'అధికారుల డుమ్మా' అంటూ ఈ నెల 21న సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు కలెక్టర్ స్పందించారు. ఈ కార్యక్రమంలో నలుగురు అధికారులే పాల్గొన్నారు. ఈ వార్తపై స్పందించిన కలెక్టర్ మీకోసం కార్యక్రమానికి హాజరు కాని అధికారులు షోకాజ్ నోటీసు ఇవ్వాలని లింగపాలెం మండల ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో మండల అధికారులు మీకోసం కార్యక్రమానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేశారు.



లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమానికి హాజరైన అధికారులు

250 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నూజివీడు: ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా తెలిపారు. నూజివీడులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారని, తద్వారా 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. దానిలో 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో ధాన్యం తాలూకా నగదు జమవుతుందన్నారు. జిల్లాలో ఇంత వరకు 64,686 కౌలు రైతు కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు.

దూరవిద్య కేంద్రం పునఃప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆదేశాల మేరకు నగరంలోని సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాల ప్రాంగణంలో దూరవిద్యా కేంద్రాన్ని పునఃప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్, ఏయూ దూర విద్యా కేంద్రం కో–ఆర్డినేటర్ కేఏ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఉచితంగా మూడు సిలెండర్లు

ఏలూరు(మెట్రో): జిల్లాలో అర్హులైన పేద కుటుంబాలకు అక్టోబరు 31 నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ పంపిణీ అమలు కానున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఆధార్ నెంబరు, రేషన్/బియ్యం కార్డు నెంబరు, ఆధార్ నెంబరుతో లింకు చేసిన బ్యాంకు ఖాతా (అకౌంటు) నెంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబరుతో కూడిన సమాచారం ఉండాలన్నారు. మొదటసారి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే లబ్ధిదారులు 29.10.2024 నుంచి 31.03.2025 వరకు తమ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకోవాలన్నారు. 5 నెలల్లో ఏ రోజైన బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖ రచన పోటీలు

ఏలూరు (టూటౌన్): జాతీయ స్థాయి లేఖరచన పోటీలు డిసెంబర్ 14 వరకు నిర్వహించనున్నట్లు తపాలా శాఖ ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్ ఎస్. శ్రీకర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల లోపు వారికి, 18 ఏళ్లు దాటిన వారికి విడివిడిగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహిస్తారని చెప్పారు. ఎన్వెలప్ కవర్ కేటగిరీ కింద వెయ్యి పదాలకు మించకుండా ఏ4 సైజు కాగితంపై లేదా ఇన్‌ల్యాండ్ కవర్‌పై రాయాలన్నారు.

క్లుప్తంగా

విత్తన మొక్కజొన్న రైతులతో ఒప్పందాలు చేసుకోవాలి



విత్తన మొక్కజొన్న ఆర్గనైజర్లతో చర్చిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

నూజివీడు: విత్తన మొక్కజొన్నను సాగుచేసే రైతులతో సీడ్ కంపెనీలు తప్పనిసరిగా లిఖిత పూర్వక ఒప్పందాలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా స్పష్టం చేశారు. సోమవారం నూజివీడులో పలు కంపెనీలకు సంబంధించిన ఆర్గనైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు కూడా తమ పంటను ఈ పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. విత్తన మొక్కజొన్న పంటకు సంబంధించిన దిగుబడిలో తేడాలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు పంట నేలపై ఉన్నప్పుడే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని, కోత అనంతరం ఫిర్యాదు చేసినట్లయితే ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ప్రైవేటు కంపెనీల ఆర్గనైజర్లు, ఇతర సిబ్బంది నిబంధనలను అతిక్రమించి రైతులకు విత్తనాలు ఇచ్చినయెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి ఏఓలు చాముండేశ్వరి, మధుమోహన్, శివశంకర్, చెన్నారావు, పలు కంపెనీల ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన

- ద్వారకాతిరుమల గురుకులంలో జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం
- విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్న 5 జిల్లాలకు చెందిన 108 మంది విద్యార్థులు
- ఆకట్టుకుంటున్న ప్రాజెక్టులు



సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శామ్యూల్

ద్వారకాతిరుమల: ప్రతిభకు సృజనాత్మకతను జోడించి టెక్నాలజీతో పలు ప్రాజెక్టులను తయారు చేశారు కొందరు గురుకులం విద్యార్థులు. వాటిని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సోమవారం ప్రారంభించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ముందుగా రెండు రోజులపాటు నిర్వహించనున్న జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి, ఉప సర్పంచ్ బొండాడ సావిత్రి, ఎంఈఓ-2 పరసావెంకట్రావులతో కలసి ఘనంగా ప్రారంభించారు. తూర్పు, పశ్చిమ, కృష్ణ, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 31 గురుకులాల్లోని 108 మంది విద్యార్థులు ఈ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్నారు. అలాగే 52 మంది సీనియర్, జూనియర్ ఉపాధ్యాయులు, 63 మంది టెక్నికల్ స్టాఫ్ ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. అందులో ముఖ్యంగా భవిష్యత్తులో భూమి ఎలా ఉండబోతోంది, ప్లాస్టిక్ కవర్ల వల్ల కలిగే హానీ.. కాగితం కవర్ల వినియోగం వల్ల చేకూరే ప్రయోజనాలు, అలాగే స్మార్ట్ ఈవీఎం.. సాధారణ బ్యాలెట్ బాక్సుల మధ్య వ్యత్యాసాలు, వాటి ఉపయోగాలను తెలిపే ప్రాజెక్టులను ప్రదర్శించారు. మంగళవారం జరిగే పలు కార్యక్రమాలతో ఈ విజ్ఞాన ప్రదర్శనలు ముగియనున్నాయి.

మహిళల రక్షణకు సహకారి



ప్రస్తుత సమాజంలో ఏదో ఒక ప్రాంతంలో నిత్యం మహిళలు, యువతులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. వాటిని నిరోధించేందుకు, మహిళలకు రక్షణ కల్పించేలా ఉమెన్ సేఫ్టీ ప్రాజెక్టును రూపొందించాం. లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళల రక్షణ చట్టాలు, ధరించాల్సిన దుస్తులు ఇలా అన్ని అంశాలను ఈ ప్రాజెక్టు తెలియజేస్తుంది.

– గుణశ్రీ, గంజి లక్ష్మీనరసింహ గౌతమి, పొలసానిపల్లి గురుకులం విద్యార్థినులు

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు



ప్లాస్టిక్ వాడకం ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. మనం వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు మట్టిలో కలవవు. వాటిని తిన్న పశువులు అనారోగ్యాల పాలై, మృత్యువాత పడుతున్నాయి. అందుకే పేపర్లతో తయారు చేసే కవర్లనే ప్రజలు వినియోగించాలి. వాటిని ఎలా తయారు చేసుకోవాలి, ఎలా వినియోగించాలి అనే విషయాలను తెలిపేలా ఈ ప్రాజెక్టును రూపొందించాం.

– నౌడు సౌమ్య, మోర్త వైష్ణవి, పిఠాపురం గురుకులం విద్యార్థినులు

ఆటోమెటిక్ డస్ట్‌బిన్‌తో మేలు



ఆటోమెటిక్ డస్ట్‌బిన్‌ను హాస్పిటల్స్, హాస్టల్స్, షాపింగ్ మాల్స్, స్కూల్స్ ఇలా అన్ని ప్రదేశాల్లో వినియోగించుకోవచ్చు. ఇందులో వేసిన చెత్త నుంచి బ్యాక్టీరియా, చెడు వాసన బయటకు రాదు. దివ్యాంగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దీని తయారీకి అయ్యే ఖర్చు కేవలం రూ.70 నుంచి రూ.100 మాత్రమే. డస్ట్‌బిన్ మూత ఆటోమెటిక్‌గా తెరచుకోవడానికి నేను పవర్ బ్యాంక్‌ను వినియోగించాను. దాని స్థానంలో చిన్న బ్యాటరీలను వాడవచ్చు.

– ఎండీ అష్రఫ్, కృష్ణాజిల్లా, పామర్రు గురుకులం విద్యార్థి

స్మార్ట్ ఈవీఎంలు బెటర్



ఎన్నికల్లో స్మార్ట్ ఈవీఎంలను ఉపయోగించడమే మేలు. అందుకే ఈ స్మార్ట్ ఈవీఎంను తయారు చేశాం. ఈవీఎంల వాడకం ద్వారా ఖర్చు, సమయం రెండూ ఆదా అవుతాయి. అలాగే ఓటరు స్పష్టంగా తమ ఓటు హక్కును వినియోగించగలుగుతారు. అదే బ్యాలెట్ అయితే ఖర్చు, సమయం వృథా అవుతాయి. సింబల్స్‌పై సరిగ్గా పడని ఓట్లు చెల్లుబాటు కావు. ఇలా బ్యాలెట్ వినియోగం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి.

– ఘంటా సుష్మా, పొన్నూరి చాందిని, వట్లూరు గురుకులం విద్యార్థినులు

హోమాల పేరుతో మోసం..

మొగల్తూరు: హోమాలు చేస్తానని నమ్మించి మోసగించిన ఓ సిద్ధాంతిపై మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై జి వాసు కథనం ప్రకారం పెనుమంత్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన పెచ్చెట్టి గోపాలకృష్ణకు కుక్కల శ్రీను అనే వ్యక్తి ద్వారా మొగల్తూరుకు చెందిన సిద్ధాంతి ఆముదాలపల్లి వెంకటాచార్యులు పరిచయమయ్యాడు. తమ సమస్యలను సిద్ధాంతికి చెప్పుకోగా మూడు రోజులపాటు హోమాలు చేస్తే పరిష్కారమవుతాయని నమ్మించాడు. దీంతో గోపాలకృష్ణ మొగల్తూరులోని సిద్ధాంతి ఇంటికి వచ్చి మూడు రోజులున్నా ఎటువంటి హోమాలు చేయలేదు. పైగా నీవు మీ ఇంటికి వెళ్లేలోపు అందరూ చనిపోతారని భయపెట్టి 54 రోజులు పాటు అతడిని ఇంటిలో నిర్బంధించాడు. దఫదఫాలుగా గోపాలకృష్ణ నుంచి రూ.37.50 లక్షలు వెంకటాచార్యులు వసూలు చేశాడు. ఈ మొత్తానికి సంబంధించి సిద్ధాంతి సమాధానం చెప్పకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

తణుకు: తణుకులో కత్తితో బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 24వ తేదీ రాత్రి తణుకు వైపు వెళుతున్న రెండు లారీలను ఇరగవరం కాలనీ వద్ద ముగ్గురు వ్యక్తులు ఆపి డ్రైవర్లను డబ్బులు డిమాండ్ చేశారు. ఈ సమయంలో ఒక లారీ డ్రైవర్‌ను కొట్టి గాయపరిచి అతని జేబులో రూ.వెయ్యి లాక్కొని పారిపోయారు. గాయాలపాలైన బాధితుడు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారించగా తణుకు పాతవూరు ఇరగవరం కాలనీకు చెందిన కొల్లాటి రత్నకుమార్, సరాకుల సురేష్, తుంపాల కన్నబాబు అలియాస్ రాజు నిందితులుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి శనివారం తణుకు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

నాణ్యమైన మేతతో అధిక పాల దిగుబడి





చింతలపూడి: పాడి పశువులకు నాణ్యమైన మేత అందించడం వల్ల పశువుల్లో పాల దిగుబడి పెరగడంతో పాటు పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె లింగయ్య తెలిపారు. పాడి పశువుల్లో విటమిన్ –ఎ, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషక పదార్థాల లోపం వల్ల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. చాలా మంది రైతులు వర్షాకాలం, చలికాలంలో పచ్చిమేతలు, ఎండాకాలంలో ఎండు గడ్డిని దాణాగా అందిస్తారు. ఇది సరైన పద్ధతి కాదని.. పచ్చిమేత ఎక్కువగా దొరికే వర్షాకాలంలో పాతర వేసి నిల్వ చేసుకోవాలని చెప్పారు. అన్ని కాలాల్లో పచ్చిమేత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు.

ఎంత మేత పెట్టాలి

రోజూ ఒక్కో పశువుకు 8 కిలోల వరి గడ్డి, లేదా ఎండు చొప్ప, 8 కిలోల లెగ్యూమ్ జాతి పచ్చిమేత(పిల్లి పెసర, అల సంద, గోరు చిక్కుడు), 16 కిలోల గింజజాతి పచ్చి మేతలు ఇస్తే.. అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. దీనివల్ల సకాలంలో ఎదకు వస్తాయిని, పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుందని తెలిపారు.

పశువుల్లో గొడ్డుమోతు సమస్యకు పరిష్కారం

సకాలంలో ఎదకు రాకపోవడం, గర్భకోశ వ్యాధులు, అండంలో లోపాల వల్ల ఈ సమస్య అధికంగా ఉంటుంది. పశువులు ఈనిన తరువాత 60 నుంచి 90 రోజుల్లో ఎదకు వచ్చి చూలు కట్టాలి. ఎదకు రాని పశువులను సకాలంలో పశువైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లి పరీక్ష చేయించాలి. ప్రతి రోజు ఎద లక్షణాలను పరిశీలించి కృత్రిమ గర్భధారణ చేయించాలి. తగిన వయసు, బరువు లేని పశువుల్ని చూడి కట్టించడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ఆవులకు 18 నెలలు, గేదెలకు 24 నెలల వయసు వచ్చిన తరువాత మాత్రమే చూడి కట్టించాలి.

ఉద్యోగాల కోసం దళారులను ఆశ్రయించవద్దు



స్పందనలో వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం దళారులను ఆశ్రయించవద్దని, ప్రభుత్వ నోటిఫికేషన్, అర్హత, పరీక్షా ఫలితాల ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయనే విషయాన్ని నిరుద్యోగులు గుర్తించాలని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి 53 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లడుతూ మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటే ప్రాణరక్షణకు కవచంలా హెల్మెట్ ఉంటుందన్నారు. అతివేగంతో ప్రయాణిస్తూ ప్రాణాలను, మీ కుటుంబంలోని పిల్లలు, భార్య భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఉన్నారు.

ఇంటినుంచి వృద్ధురాలి గెంటివేత



ఇంటిలో నుంచి బయటకు గెంటేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు వెంకాయమ్మ

జంగారెడ్డిగూడెం రూరల్: ఓ వృద్ధురాలిని కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటకు నెట్టేసిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలివి. నాగులగూడెం గ్రామానికి చెందిన తానెంకి వెంకాయమ్మకు ఇద్దరు కుమారులు. వీరిద్దరూ జంగారెడ్డిగూడెంలో బాట గంగానమ్మ లేఔట్ కాలనీలో వేర్వేరుగా ఉంటున్నారు. నాగులగూడెంలో ఉన్న తన ఇల్లు కూలిపోవడంతో పెద్ద కుమారుడైన నర్సింగరావు వద్ద వెంకాయమ్మ ఉండేది. అయితే కొన్ని నెలల క్రితం పెద్ద కుమారుడు ఇంటి నుంచి బయటకు వచ్చేసి పలు చోట్లు తలదాచుకుంటూ జీవనం సాగించింది. దీంతో చిన్న కుమారుడు రాజు నాగులగూడెంలో తనకున్న మరో ఇంటిలో ఉండమని చెప్పడంతో గత రెండు నెలలుగా ఆమె ఆ ఇంటిలోనే జీవిస్తోంది. అయితే వెంకాయమ్మ ఇంటి స్థలాన్ని తనకు రాసి ఇచ్చినట్లు పెద్ద కుమారుడు ప్రచారం చేస్తుండడంతో ఈవిషయంపై చిన్న కోడలు వరలక్ష్మి, మనుమడు ఆమెతో ఘర్షణకు దిగారు. ఆస్తి పెద్ద కుమారుడికి ఇచ్చినప్పుడు మా ఇంటిలో ఎందుకు ఉంటున్నావు అంటూ ఇంటి తాళాలు వేసి ఆమెను బయటకు గెంటివేశారు. కనీసం తాను జీవించే ఉన్నంత వరకైనా తనను ఇంటిలో ఉండేలా అవకాశం కల్పించాలని వెంకాయమ్మ వేడుకుంటోంది. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎస్‌వీ రమణ, తహసీల్దార్ స్లీవజోజితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. ప్రస్తుతం ఉంటున్న ఇంటిలోనే వెంకాయమ్మ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఆర్డీవో కోర్టుకు హాజరు కావాలని కుమారులకు నోటీసులు జారీ చేసినట్లు ఆర్డీవో రమణ తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బాసటగా నిలవాలి



ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న దేగ ప్రభాకర్, అగ్రిగోల్డ్ ఏజెంట్లు

కొయ్యలగూడెం: అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం బాసటగా నిలిచి సమస్యను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు దేగ ప్రభాకర్ పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలానికి చెందిన అగ్రిగోల్డ్ ఏజెంట్లు సోమవారం ప్రభాకర్‌ను కలుసుకుని బాధితులకు న్యాయం చేయడంలో సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి అని మహా విజ్ఞాపన దీక్ష విజయవాడలో చేపట్టిన నేపథ్యంలో తామందరూ పాల్గొన్నట్లు ఏజెంట్లు తెలిపారు. రూ.10 వేల లోపు డిపాజిట్లు కలిగిన కొందరు ఖాతాదారులకు గత ప్రభుత్వం సొమ్ములు చెల్లించిందని, అదేవిధంగా రూ.20 వేల లోపు ఉన్న వారందరికీ కూడా సొమ్ములు చెల్లించాలనే డిమాండ్‌తో ఉద్యమాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ ఖాతాదారులు తమ ఉద్యమానికి చేయూతనందించాలని వారు కోరారు.

ఉరివేసుకుని యువకుడి మృతి



కొప్పుల నరేష్ (ఫైల్)

కుక్కునూరు: ఉరివేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలో జరిగింది. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలివి. ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన కొప్పుల నరేష్ (33) తన భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయం అత్త, మామలకు చెప్పినా వారు పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు చెప్పారు. తమ కుమారుడి మృతిపై కోడలు నవ్య, మరికొందరిపై అనుమానం వ్యక్తం చేస్తూ నరేష్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తుంది.

స్విమ్మింగ్ పోటీల్లో పోలీసులకు పతకాల పంట



పతకాలు సాధించిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: గుంటూరులో ఈనెల 27వ తేదీన నిర్వహించిన 5వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా పోలీసులు పలు పతకాలు సాధించినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ పి సత్యనారాయణ 400 మీటర్ల ఫ్రీ స్టయిల్‌పోటీల్లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోటక్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. అలాగే తాడేపల్లిగూడెం టౌన్ కానిస్టేబుల్ డి అనిల్‌కుమార్ 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీల్లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఎస్ శ్రవణ్‌కుమార్ 100 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్లో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. సోమవారం విజేతలను ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అడిషినల్ ఎస్పీ వి భీమారావు అభినందించారు.

వంట గ్యాస్ లీకై..

ముసునూరు: వంట గ్యాస్ లీకై నివాస గృహం దగ్ధమైన ఘటన ముసునూరు మండలంలోని గోపవరంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గోపవరంనకు చెందిన కోడె శ్రీనివాసరావు ఇంటిలో గ్యాస్ పైపు నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మంటలు అధికమై ఇంటిని చుట్టుముట్టాయి. కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి, ప్రాణాలు దక్కించుకున్నారు. నూజివీడు నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో బయటపడ్డారు. బంగారం, వెండి నగలు, నగదు అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

రేపు స్కూల్ గేమ్స్ క్రికెట్ సెలెక్షన్స్

వీరవాసరం: ఈనెల 30వ తేదీన స్కూల్ గేమ్స్ క్రికెట్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14, 17 బాలుర క్రికెట్ జట్ల ఎంపికలు తణుకు (తేతలి) స్టెప్పింగ్ స్టోన్స్ స్కూల్ నందు, అండర్ 17 బాలికల జట్ల ఎంపికలు దేవరపల్లి అంబటి సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరుగుతాయన్నారు. వివరాలకు 80741 53923లో సంప్రదించాలని కోరారు.

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్ట్

పెదవేగి: నాటు తుపాకీ కలిగిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెదవేగి మండలం రామశింగవరం గ్రామంలో ఓ వ్యక్తి తుపాకీతో తిరుగుతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై కె.రామకృష్ణ గ్రామంలోకి వెళ్లేసరికి పొలంలో కొండా రాంబాబు అనే వ్యక్తి ఎటువంటి అనుమతి లేకుండా నాటు తుపాకీ కలిగి ఉన్నాడు. అతడిని అరెస్ట్ చేసి, నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ చెప్పారు.



